29న మణుగూరుకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రాక

మణుగూరుటౌన్, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 29న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మణుగూరు మండలంలో పర్యటిస్తారని నాయకులు ఆదివారం తెలిపారు. అనంతరం పట్టణంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మెడికల్ కార్డు కోసం లైవ్ సర్టిఫికెట్ అందజేయాలి

మాట్లాడుతున్న ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 21: మెడికల్ కార్డు రెన్యూవల్ కోసం లైవ్ సర్టిఫికెట్‌ను అందజేయాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. అదివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీపీఆర్ఎంఎస్ ఎన్ఈ మెడికల్ కార్డు ఉన్న మాజీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల భార్యలు మెడికల్ కోసం ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడం జరుగుతుందన్నారు. సీపీఆర్ఎంఎస్ ఎన్ఈ మెడికల్ కార్డు కలిగి ఉన్న 282మంది నవంబర్ నుంచి ఇప్పటివరకు లైఫ్ సర్టిఫికెట్ అందజేయలేదని దీంతో మెడికల్ కార్డు సేవలు నిలిపివేయబడుతాయన్నారు. కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా లైసెన్స్ సమర్పించి మెడికల్ కార్డు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

రేపు మాలోత్ కవిత నామినేషన్

సమావేశంలో మాట్లాడుతున్న మానె రామకృష్ణ

భద్రాచలం, ఏప్రిల్ 21: మహబూబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాలోత్ కవిత మంగళవారం నామినేషన్ వేస్తారని, కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకులు తాండ్ర వెంకటరమణారావు, మానె రామకృష్ణ అన్నారు. సమావేశంలో కోటగిరి ప్రబోద్‌కుమార్, ఆకోజు సునీల్ కుమార్, తాండ్ర నర్సింహారావు, రేపాక పూర్ణచంద్రరావు, కోలా రాజు, ఉడతా రమేశ్, బత్తుల నర్సింహులు, సింగిడాల సతీశ్, ఐనాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరుగురు మిలీషియా సభ్యుల లొంగుబాటు

లొంగిపోయిన మావోయిస్టు మిలీషియా సభ్యులను చూపుతున్న ఏఎస్పీ

భద్రాచలం, ఏప్రిల్ 21: ఆరుగురు మావోయిస్టు మలీషియా సభ్యులు లొంగిపోయారని భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్ తెలిపారు. ఆదివారం భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని డోకుపాడుకు చెందిన రవ్వ సన్న, ముసికి సన్న, మడకం జోగా, కోవాసి మంగ, రవ్వ లక్కు, పుట్టపాడుకు చెందిన కర్లం పాజ్జాలు ఉన్నారన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు సంబంధించి కేసుల విచారణ త్వరగా పూర్తి చేసి, వారు సాధారణ జీవితం గడిపేందుకు అన్నిచర్యలను పోలీసు శాఖ తీసుకుంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా వీరికి ప్రభుత్వం తరపున అందే అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు.

28న ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశపరీక్ష

గుండాల, ఫిబ్రవరి 21: 2024-25 విద్యాసంవత్సరానికి గానూ రాష్ట్రంలోని 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ధరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు మామాకన్ను పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందు హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

సీపీఐ మండల కార్యదర్శిగా ధర్మ

దమ్మపేట, ఏప్రిల్ 21: సీపీఐ మండల మండల కార్యదర్శిగా సుంకిపాక ధర్మ ఎన్నికయ్యారు. ఆదివారం దమ్మపేటలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సహాయ కార్యదర్శులుగా బత్తుల సాయి, యార్లగడ్డ మణికంఠ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యార్లగడ్డ భాస్కరావు మాట్లాడుతూ పార్టీని, ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచింపడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రచారం ఆర్భాటం.. కొనుగోళ్లు శూన్యం..

- నిరుపయోగంగా ధాన్యం సేకరణ కేంద్రాలు
- కనీస సౌకర్యాలు కల్పించక ఇబ్బందులు పడుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోసిన కర్షకులు
- సర్కారు నిబంధనలతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం

అన్నపురెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోళ్లను తనిఖీ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల (ఫైల్)

అశ్వారావుపేట, ఏప్రిల్ 21: రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ప్రచార ఆర్భాటం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ నిబంధనలకు విసుగు చెందిన రైతులు తక్కువ ధర అయినా ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ఫలితంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ కేవలం 12 కేంద్రాల్లోనే ధాన్యం సేకరణ జరుగుతోంది. మిగతా 28 కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నెల 1వ తేదీన అధికారులు కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించారు. కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గత కేసీఆర్ ప్రభుత్వంలో దీమాగా పంటలు సాగు చేసిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంలో అవస్థలు పడుతున్నారు. ఒక ప్రక్క రైతుబంధు సకాలంలో అందక రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పండించిన ప్రతి గింజను కొంటామని అధికారులు చెపుతున్నా ప్రభుత్వ నిబంధనలతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలతో కొర్రీలు..

రైతుల నుంచి ధాన్యం సేకరణలో అధికారులు నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతున్నారు. నాణ్యత, తూర్పాబెట్టడం, తాలు వంటి నియమ, నిబంధనతో రైతులు కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధర అయినప్పటికీ నిబంధనలు లేకుండా ప్రైవేట్ వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో అటు వైపు మొగ్గు చూపుతున్నారు. కల్లాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని భద్ర పరచటం కంటే ఎక్కడికక్కడ ధాన్యం కొనుక్కొని అక్కడ నుండే తీసుకెళ్లిపోతున్న ప్రైవేట్ వ్యాపారులే నయం అంటూ సర్దుకుపోతున్నారు.

కనిపించని కనీస సౌకర్యాలుః

ధాన్యం పండించే రైతులకు సాగు కష్టాలు తప్పటం లేదు. పండించిన పంటను అమ్ముకోవటానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక ఎండల్లోనే కేంద్రాల్లో పడిగాపులు పడుతున్నారు. తాగటానికి తాగునీరు, కూర్చోవటానికి నీడ లేక చెట్ల కింద చేరుతున్నారు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి చోటు లేక రహదారి ప్రక్కనే రాసులు పోసుకుని కాపలా కాస్తున్నారు. సకాలంలో కొనుగోలు చేయకపోవటంతో అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తుంది. దేవుడిపైనా భారం వేసి కొనుగోలు కేంద్రాల చుట్టూ ధాన్యం అమ్ముకునే వరకు ప్రదక్షణలు చేస్తున్నారు.

అన్ని ఇబ్బందులే

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అన్ని ఇబ్బందులే ఎదురవుతున్నాయి. పెట్టుబడి సాయం కింద 'రైతు బంధు' అందక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు లేక ఆశించిన స్థాయిలో దిగుబడులు కూడా రైతు చేతికి అందని పరిస్థితి. కాంగ్రెస్ ఎన్నికల హామీగా ఇచ్చిన వరి రూ.500 బోనస్ బోగస్‌గానే అభిప్రాయపడుతున్నారు. రైతు బీమా ప్రభుత్వం చెల్లించిందో లేదో కూడా అర్థం కావటం లేదని రైతులు అంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏ సమస్య లేకుండా ధాన్యం పండించామని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ సంపతృప్తికరంగా సాగాయని, నగదు చెల్లింపులు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవని పేర్కొంటున్నారు.

గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం

గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అనేక నిబంధనలు పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేట్ వ్యాపారులు పంట కోసిన వెంటనే ఎటువంటి నిబంధనలు లేకుండా తీసుకెళ్ళిపోతున్నారు. అందుకే ధర తక్కువ అయినా వారికీ విక్రయిస్తున్నాము. 77 కేజీల ధాన్యం బస్తాకు రూ.1,500 ఇస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎటువంటి సమస్యలు లేకుండా ధాన్యం విక్రయాలు సాఫీగా జరిగాయి.

– చిమడబోయిన వెంకటేశ్వరరావు, రైతు, గుమ్మడవల్లి, అశ్వారావుపేట మండలం

రెస్క్యూ సభ్యుల సేవలు అనిర్వచనీయం

మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

రామవరం, ఏప్రిల్ 21 : సింగరేణి సంస్థలో ఆపద కాలంలో రెస్క్యూ టీం సేవలు అనిర్వచనీయమని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజు అన్నారు. ఆదివారం ఏరియా పరిధిలోని గౌతంపూర్ కమ్యూనిటీహాల్‌లో రీజనల్ ఇల్లెందు, కొత్తగూడెం ఏరియా, మణుగూరు ఏరియాలో శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన సాంకేతిక పరికరాలను ఉపయోగించుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

పెద్దమ్మతల్లి సన్నిధిలో భక్తుల సందడి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 21 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులతో సందడి వాతావరణం ఏర్పడింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగ చూడమని వేడుకున్నారు. పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం, మధిర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ పిల్లలకు అన్నప్రాసన, తలనీలాల కార్యక్రమాలు జరుపుకున్నారు. సత్రాలు నిండిపోవడంతో చెట్ల కింద వంటా వార్పు చేపట్టారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈవో సుదర్శన్ పర్యవేక్షించారు. 23వ తేదీన చండీహోమం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి వితరణ

మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి ఏసీని వితరణగా ఇస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు, పీవీకే 5గని అధికారులు, ఉద్యోగులు

రామవరం, ఏప్రిల్ 21 : భద్రాచలంలోని మానవసేవ అనాథ, వృద్ధ, మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి రూ.లక్షా 25 వేలు విలువ గల ఏసీ, ఫ్రిడ్జ్, వాషింగ్‌మిషన్, నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. పీవీకే 5 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారుల జీతం నుంచి ప్రతి నెలా రూ.50 చొప్పున సేకరించి ఆదివారం అందజేశారు. బి.రవీందర్, శ్రీనివాస్, వి.అజయ్, సాయి, పవన్, వై.శంకర్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఉన్నారు.

పంటకోత ప్రయోగంతో దిగుబడి అంచనా

వరికోతను ప్రారంభిస్తున్న సీపీవో శ్రీనివాసరావు

చుంచుపల్లి, ఏప్రిల్ 21 : వరి పంటకోత ప్రయోగం ద్వారా దిగుబడి అంచనా వేస్తామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు అన్నారు. డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం దుమ్ముగూడెం, నర్సాపురం గ్రామంలోని రావులపల్లి ప్రుద్ది రైతు పొలంలో 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో పంటకోత ప్రయోగం నిర్వహించారు. మొదటి ప్రయోగంలో 7.285 కిలోలు, రెండో ప్రయోగంలో 14.735 కిలోలు దిగుబడి వచ్చిందని సీపీవో తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆటోమేటిక్ వెదర్‌స్టేషన్ పనితీరును పరిశీలించారు. వారివెంట అధికారులు కన్సెల్‌టెంట్ టీఎస్‌పీఎస్ ఎం.రాంభద్రు, ఉపగణాంక అధికారి కె.వెంకట్రావు, తిరుపతి, ఎంపీఎస్‌వో బి.ప్రదీప్, ఎఫ్‌టి సింగ్, రైతులు ఉన్నారు.

మణుగూరుకు చేరిన ఈవీఎంలు

ఐటీడీఏ పీవో సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన అధికారులు

స్ట్రాంగ్ రూమ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: పార్లమెంటు ఎన్నికల కోసం పినపాక నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలు శనివారం రాత్రి మణుగూరుకు చేరుకున్నాయి. ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ఆధ్వర్యంలో మణుగూరు జడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో వీటితోపాటు ఎన్నికల సామాగ్రిని కూడా భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద అధికారులు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటుచేశారు. మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, సీఐ సతీశ్‌కుమార్, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనగడపలో తాగునీటికి కటకట

ట్యాంకుల ద్వారా నీటిని పట్టుకుంటున్న పెనగడపవాసులు

చుంచుపల్లి, ఏప్రిల్ 21 : ఎండాకాలంలో నీరు లేకపోతే చాలా ఇబ్బందిగా ఉంటుంది. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకులు, మినీ వాటర్ స్కీం బోర్లు పని చేయకపోవడంతో నీటి కోసం అల్లాడుతున్నారు. ముస్లింవాడలో 60 ఇండ్ల వారు సొంత డబ్బులతో బోరు మరమ్మతులు చేయించుకొన్నారు. పంచాయతీ వారు పట్టించుకొని బోర్లను బాగు చేయించాలని, మిషన్ భగీరథ నీటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 21: మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కుమార్తె డాక్టర్ తాటి మహాలక్ష్మి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని అమ్మ సేవా సదనంలోని వృద్ధులకు దుస్తులు అందజేసి అన్నసంతర్పణ నిర్వహించారు. అనంతరం రూ. 10 వేలు సేవాసదనానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అంకత మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ కరుటూరి వెంకటేశ్వరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, మాజీ సర్పంచ్ పొట్టా రాజులు, నాయకులు యూఎస్ ప్రకాశ్, మోటూరి మోహన్, తగరం హరి, నందికోల వెంకన్న, ఆరేపల్లి గోవిందు, పంబి గణపతి, వేముల ప్రసాద్, శ్రీరామూర్తి, చిప్పనపల్లి శ్రీను పాల్గొన్నారు.

పంజాబ్‌గడ్డలో అన్నదానం

అన్నదానం చేస్తున్న జమలయ్య

రామవరం, ఏప్రిల్ 21 : రామవరం పంజాబ్‌గడ్డ 8వ వార్డులో శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సీతారామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ జమలయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. పెయ్యాల రంగారావు, రాజ్యానిదేవదాస్, పాటి మోహన్‌రావు, బడుగు భాస్కర్, స్వామి, హరినాథ్ నిఖిల్, ప్రసాద్, ఎల్లయ్య, రాజరత్నం పాల్గొన్నారు.

రేపు బీఆర్ఎస్ సన్నాహాక సమావేశం

దమ్మపేట, ఏప్రిల్ 21: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మంగళవారం దమ్మపేటలో నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డాకుల రాజేశ్వరరావు, దొడ్డా రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

ఎన్డీ అభ్యర్థి మురళీకృష్ణను గెలిపించాలి

టేకులపల్లి, ఏప్రిల్ 21: సీపీఎం (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని కోరుతూ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని ముత్యాలంపాడు, తూర్పుగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తు మురళీకృష్ణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ రామచంద్రు, నర్సయ్య, మంగయ్య, ప్రసాద్, రాము, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు బోనాలు

టేకులపల్లి, ఏప్రిల్ 21: మొక్కంపాడుతండాలో గ్రామ దేవతలకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం మండలంలోని మొక్కంపాడు గ్రామ పంచాయతీ మొక్కంపాడుతండాలో గ్రామదేవతల విగ్రహాలు ప్రతిష్ఠించి 9 రోజులు అయిన సందర్భంగా ప్రత్యేక బోనాలు సమర్పించారు. భక్తులు పాల్గొని బోనాలు సమర్పించారు.

బెల్టు షాపులపై అధికారుల దాడి

అశ్వారావుపేట, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు బెల్టు షాపులపై దాడి చేశారు. మండలంలోని పాత నారంవారిగూడెం గ్రామానికి చెందిన సత్యనారాయణ బెల్టు దుకాణంపై దాడి చేసి రూ.26,334 విలువ గల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఏఎస్సై యాకూబ్ అలీ తెలిపారు. దుకాణదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రామాలయంలో అన్నసమారాధన

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 21: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శనివారం ఐదో రోజున పట్టణంలోని పలు నవమి మండపాల వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. చిన్నంశెట్టి బజార్‌లోని రామాలయం, వడ్డెర బజార్‌లోని చలువ పందిర వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య సీతారాముల వారిని ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అవయవ దానం

ఏలేంద్ర (ఫైల్)

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: మండలంలోని పీకే-1 సెంటర్‌కు చెందిన మర్రికుక్కల ఏలేంద్ర బ్రెయిన్ డెడ్ కావడంతో వైద్యులు ఆమె చనిపోతుందని కుటుంబ సభ్యులకు తెలపడంతో ఆమె అవయవాలను దానం చేశారు. గుండె, కళ్లు, లివర్, కిడ్నీలు దానం చేయడం ద్వారా నలుగురుకి ఉపయోగపడతాయని కుటుంబసభ్యులు భావించి మృతురాలి భర్త రాములు వారి కుటుంబసభ్యులు నిర్ణయం తీసుకున్నారు.

కలప పట్టివేత

పట్టుకున్న కలపతో ఎఫ్‌డీవో వెంకన్న

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆటవీ రేంజ్ పరిధిలో ఆక్రమంగా తరలించేందుకు ఉంచిన కలపను ఎఫ్‌డీవో కే వెంకన్న అధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అదివారం మండలంలోని సత్యనారాయణపురంలోని వాగు పక్క చెట్ల పొదల్లో దాచి ఉన్న కలపను విశ్వసనీయ సమాచరం మేరకు తనీఖీలు చేపట్టి 60 కలప దుంగలను గర్తుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.30లక్షలు ఉంటుందని ఎఫ్‌డీవో వెంకన్న తెలిపారు. ఈ దాడుల్లో బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి హల్‌చల్

భద్రాచలం, ఏప్రిల్ 21: పట్టణంలోని కూనవరం రోడ్డులో నెల్లిపాక నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఆపి అనుమానితులుగా భావించి వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా వారు పారిపోతుండగా పట్టుకోబోయిన కానిస్టేబుల్ కిందపడటంతో గాయాలయ్యాయి. బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి గాయాలు కావడంతో ఆ వ్యక్తిని పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి ఆసుపత్రి నుండి బైటకు వచ్చి పట్టణంలో హల్‌చల్ చేసాడు. పోలీసులు సీసీ కెమెరాల సాయంతో ఆ వ్యక్తిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చెట్టుమీద నుంచి పడి వ్యక్తి మృతి

పాల్వంచ, ఏప్రిల్ 21 : కేటీపీఎస్‌కు చెందిన జెన్కోకాలనీ సబ్‌స్టేషన్‌లో(పీఏ)గా పనిచేస్తున్న ఎండీ గౌస్(48) మామిడిచెట్టుపై నుంచి కిందపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేటీపీఎస్ 5వ కర్మాగారంలో పీఏగా పనిచేస్తున్న గౌస్ శనివారం నైట్ డ్యూటీ చేసి ఆదివారం ఇంటికి వస్తుండగా గెస్ట్‌హౌస్ పక్కన ఉన్న మామిడిచెట్టు కాయలు కోసుకొని పోదామని ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, ఏప్రిల్ 21: కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దమ్మపేట శివారు నెమలిపేట సమీపంలోని పామాయిల్ తోటలో ఆదివారం జరిగింది. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోపి అల్లిపల్లి గ్రామానికి చెందిన కలిదిండి మహేంద్ర వర్మ (37)కు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి ఏపీలోని ఏలూరు జిల్లా భీమవరంలో భార్యతో కలిసి ఉండేవాడు. కొద్దికాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఐదు నెలల క్రితం మహేంద్ర వర్మ తన భార్యతో గొడవపడి అల్లిపల్లిలోని సొంత ఇంటికి వచ్చాడు. తమ గేదెల ఫాంలో తల్లి, తమ్ముడుతో కలిసి పనిచేసుకుంటూ ఉంటున్నాడు. ఆదివారం తనకు తెలిసిన వాళ్లు భూమి కొనడానికి వచ్చారని దమ్మపేటకు వెళ్లి వస్తానని తల్లికి చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం దమ్మపేట శివారులోని నెమలిపేట వద్ద పామాయిల్ తోటలో పురుగుమందు తాగి మృతి చెంది ఉన్నట్లు మృతుడి తమ్ముడు విజయరామ రాజు తన తల్లి ప్రమీలా రాణికి ఫోన్ చేసి చెప్పాడు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తల్లి ప్రమీలారాణి దమ్మపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.